విషసర్పాలతో ప్రజల బెంబేలు

- ముంపు పెరగడంతో జనారణ్యంలోకి వస్తున్న పాములు
- చిట్టడవులను తలపిస్తున్న రహదారులు
- ఉపాధి హామీలో మరమ్మతులు శూన్యం

మలికిపురం: గ్రామాల్లో విషసర్పాల సంఖ్య గణనీయంగా పెరిగి వాటి సంచారం అధికమైంది. రాజోలు దీవిలోని అనేక గ్రామాల్లో విషసర్పాల బెడద అధికంగా ఉంది. వరదల తాకిడి అధికంగా ఉండే లంక గ్రామాలతో పాటు ఇతర గ్రామాల్లో కూడా పాముల సంచారం తీవ్రంగా ఉంది. ఇటీవల పాముకాటుకు గురై ఆసుపత్రులకు చేరే వారి సంఖ్య తక్కువగా ఉన్నప్పటికీ వాటి సంఖ్య పెరిగి నివాస ప్రాంతాల్లో సైతం వాటి సంచారం పెరగడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఒకవేళ పాముకాటుకు గురైన వ్యక్తులు ప్రైవేటు ఆసుపత్రులనే ఆశ్రయిస్తున్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో పాముకాటు వ్యాక్సిన్ పూర్తి స్థాయిలో అందుబాటులో ఉన్నప్పటికీ నెలకు ఒక్కో కేసు మాత్రమే పీహెచ్‌సీలకు వెళ్తున్నాయి. పీహెచ్‌సీల పనితీరుపై ప్రజలకు అంతగా నమ్మకం లేక ప్రభుత్వ ఆసుపత్రుల కంటే ప్రైవేటు ఆసుపత్రులనే ఆశ్రయిస్తున్నారనే ప్రచారం ఉంది. మనుషులతో పాటు పశువులు కూడా విషసర్పాల కాట్లకు గురవుతున్నాయి. ఇలా ఉంటే గ్రామాల్లో ఇటీవల పాముల సంచారం అధికంగా ఉండడానికి గ్రామస్తులు అనేక కారణాలు చెబుతున్నారు. సాధారణంగా వ్యవసాయ పొలాలు, కొబ్బరి తోటల్లో పాముల సంచారం అధికంగా ఉంటుంది. కానీ ప్రస్తుతం అనేక గ్రామాల్లో నివాస ప్రాంతాలకు పాములు ఎగబడుతున్నాయని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. ప్రధానంగా ఇటీవల కురిసిన భారీ వర్షాలకు, సంభవించిన వరదలకు గ్రామాల్లోని చిట్టడవులు, ఇతర పాముల నివాసాలు ముంపునకు గురై విషసర్పాలు నివాస ప్రాంతాల వైపు వస్తున్నాయని గ్రామస్తులు పేర్కొంటున్నారు. అలాగే సముద్రతీరంలోని డ్రైన్ల పనితీరు సక్రమంగా లేక సాధారణ సమయాల్లో కూడా పొలాలు ముంపులోనే ఉండడం వల్ల పాములు జనారణ్యం వైపు వస్తున్నారు. నేటికీ ముంపునీరు ఇలానే ఉండడం గమనార్హం. అలాగే రాజోలు దీవిలోని అనేక గ్రామాల్లో రోడ్ల నిర్మాణాలకు జిల్లాలోని వివిధ అటవీ ప్రాంతాల నుంచి గ్రావెల్, మెటల్‌ను లారీల ద్వారా తీసుకొస్తున్నారు. ఇది గత ఇరవై ఏళ్లుగా అధికమైంది. వీటి ద్వారా విష సర్పాలు, వాటి గుడ్లు కూడా ఈ ప్రాంతాలకు దిగుమతి జరిగి ఇక్కడ వాటి సంతతి అధికమైంది. గతంలో ఎన్నడూ చూడని వింత పాములు ఈ ప్రాంతంలో దర్శనమిస్తున్న సందర్భాలు వీటిని రుజువు చేస్తున్నాయి. కొండ చిలువలతో పాటు రక్త పింజర వంటి విషసర్పాలు అడవులు, కొండ ప్రాంతాలకు చెందినవే. రక్త పింజరలు, ఓ మోస్తరు కొండ చిలువలను గ్రామాల్లో ప్రజలు అధికంగా అంతమొందిస్తున్నారు. కొన్ని సంఘటనలు బయటకు తెలియడం లేదు కూడా.


శంకరగుప్తంలో ఇటీవల గ్రామస్తులు హతమార్చిన రక్తపింజర


అంతర్వేది రోడ్డులో దర్జాగా వెళ్తున్న విషసర్పం

ఇదిలా ఉంటే గ్రామాల్లో ఈ ప్రాంతాలకే చెందిన వివిధ రకాలు తాచుపాములు, కట్ల పాములు, పొడ పాముల సంచారం కూడా అధికంగా ఉంది. తాటిపాక నుంచి శివకోడు జాతీయ రహదారితో పాటు చింతలపల్లి, కూనవరం, పొన్నమండ, బి.సావరం తదితర గ్రామాల్లో అనేక పాములను గ్రామస్తులు గుర్తించి హతమారుస్తున్నారు. మలికిపురం మండలం అయ్యవారితిప్ప ప్రధాన రహదారిలో ప్రతి రోజూ నాలుగు నుంచి ఐదు విష సర్పాలు వాహనాల కింద పడి చనిపోయి చోదకులను భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. విశ్వేశ్వరాయపురం నుంచి మలికిపురం ప్రభుత్వ కార్యాలయాల వైపు వెళ్లే బైపాస్‌రోడ్డులో కూడా ఇదే పరిస్థితి. అంతర్వేదిపాలెం, సఖినేటిపల్లి, రామరాజులంక, కేశవదాసుపాలెం తదితర గ్రామాల్లో నిత్యం ఈ పాములు కలవర పరుస్తున్నాయి. ఈ ప్రాంతాల్లో రోడ్లు కూడా అభివృద్ధికి నోచుకోక పాములకు నివాసాలుగా మారాయని గ్రామస్తులంటున్నారు. నియోజకవర్గంలో అనేక రోడ్లు అడవులను తలపిస్తున్నాయి. ఉపాధి హామీ పథకంలో వీటిని మరమ్మతులు చేసే అవకాశం ఉన్నా పట్టించుకునే వారు లేరని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

విషసర్పాల బెడద అధికమైంది



కాలనీల్లో సైతం విష సర్పాల బెడద అధికమైంది. రోడ్ల నిర్మాణంలో వాడే కంకర తరలింపులో తగిన జాగ్రత్తలు తీసుకుంటే బయట ప్రాంతాల నుంచి వచ్చే విష సర్పాల దిగుమతి అరికట్టవచ్చు. లేకుంటే భవిష్యత్తులో ఇంకా పెరుగుతాయి. పంచాయితీ స్థాయిలో కూడా అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.

– పెదపాటి నాగలక్ష్మి, అప్పనరామునిలంక

జంగిల్ క్లియరెన్స్ చేయాలి



గ్రామాలలో గత కొంత కాలంలో జంగిల్స్ క్లియరెన్స్ నిలిచి పోయింది. రహదారుల వెంబడి డొంకలు భారీగా పెరిగి పోయాయి. ఉపాధి హామీలో నిధుల లేక ఈ పరిస్థితి నెలకొంది. ఫలితంగా విష సర్పాలు రోడ్లు,కాలనీల వైపు వచ్చి సాధారణ పౌరులను ఆందోళనకు గురి చేస్తున్నాయి.

– రుద్రరాజు గోపాలకృష్ణంరాజు, లక్కవరం

క్లుప్తంగా

స్వామివారి సన్నిధిలో ఎస్పీ కృష్ణారావు


అంతర్వేది ఆలయంలో ఎస్పీ కృష్ణారావు

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహుని ఆలయంలో శుక్రవారం కోనసీమ జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు, స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. పూజల అనంతరం అర్చకులు ఆశీర్వచనాలు పలికారు. స్వామివారి చిత్రపటం, లడ్డూ ప్రసాదాన్ని ఆయనకు, ఆలయ ఏసీ వి.సత్యనారాయణ అందజేశారు.

నిత్యాన్నదానానికి విరాళం


దాతకు స్వామి చిత్రపటం అందజేస్తున్న ఆలయ అర్చకులు

అయినవిల్లి: స్థానిక విఘ్నేశ్వరస్వామి ఆలయంలో అమలు చేస్తున్న నిత్యాన్నదానానికి హైదరాబాద్‌కు చెందిన మంథా సత్యనారాయణమూర్తి, కామేశ్వరి దంపతులకు శుక్రవారం రూ.11,116లు అందజేశారు. దాత ఈ సొమ్మును ఆలయ అర్చకులు వినాయకరావుకు అందజేశారు. దాతను వేదమంత్రాలతో సత్కరించి స్వామి చిత్రపటం, ప్రసాదం అందజేశారు. దాతను ఆలయ సిబ్బంది, గ్రామస్తులు అభినందించారు.

చింతనలంకలో నగర సంకీర్తన

అయినవిల్లి: మండలంలోని చింతనలంకలో నల్లచెరువు అంతర్జాతీయ శ్రీకృష్ణమందిర్ నిర్వాహకుడు సుందర శ్రీనివాస్‌దాస్ ప్రభూజీ ఆధ్వర్యంలో శుక్రవారం తెల్లవారుజామున నగర సంకీర్తన నిర్వహించారు. హరే కృష్ణ హరే కృష్ణ, కృష్ణ కృష్ణ హరే హరే అంటూ గ్రామవీధుల్లో శ్రీకృష్ణ భక్తులతో తిరిగారు. సుందర శ్రీనివాస్ దాస్ ప్రభూజీ శ్రీకృష్ణనితత్వం ప్రబోధించారు.

ప్రత్యేక ఆకర్షణగా గోదాదేవి చిత్రం


ఆలయ ప్రాంగణంలో గీసిన గోదాదేవి చిత్రం

రావులపాలెం: స్థానిక అలమేలు మంగా పద్మావతి ఆండాళ్ సహిత వేంకటేశ్వరస్వామి ఆలయంలో ధనుర్మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలో గోదాదేవి అమ్మవారి చిత్రాన్ని గీసి చుట్టూ దీపాలు ఏర్పాటు చేశారు. ఈ చిత్రం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

ఉపాధి కల్పనలో సరికొత్త ఒరవడి సృష్టిద్దాం

ఆలమూరు: ఎన్ఆర్ఈజీఎస్ పథకంలో ఏటా నిర్వహించే పనులతో పాటు కొత్త పనులను సృష్టించి అనేక మంది కూలీలకు అదనంగా ఉపాధిని కల్పించాలని రాష్ట్ర గ్రామీణ పంచాయతీరాజ్ కమిషనర్ కృష్ణతేజ అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా శుక్రవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ మండలస్థాయి అధికారులు పాల్గొన్నారు. ఆలమూరు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆలమూరు, కపిలేశ్వరపురం మండలాలకు చెందిన ఎంపీడీఓలు ఎ.రాజు, రత్నకుమారి, ఏపీఎంలు జి.అరుణకుమారి, రవికిరణ్ పాల్గొన్నారు. ఈసందర్భంగా స్థానిక ఎంపీడీఓ రాజు మాట్లాడుతూ మండలంలో జనవరి 01 నుంచి జూన్ 30 వరకూ ఆరు నెలల పాటు మండలంలోని నమోదు చేసుకున్న ఉపాధి కూలీలందరికి 2.50 లక్షల పనిదినాలను కల్పించాలని ప్రభుత్వం ఆదేశించిందన్నారు.

దంతాలపై నిర్లక్ష్యం వద్దు

అంబాజీపేట: ప్రతీ విద్యార్థి దంతాల పట్ల నిర్లక్ష్యం వహించకుండా తగు జాగ్రత్తలు తీసుకోవడం వల్ల సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటాయని సీహెచ్‌ఓ బి.అప్పారావు అన్నారు. ఆర్బీఎస్‌కే రాష్ట్రీయ బాల స్వస్థ కార్యక్రమంలో భాగంగా గంగలకుర్రు జెడ్పీ హైస్కూల్ విద్యార్థులకు దంత వైద్య పరీక్షలను శుక్రవారం నిర్వహించారు. అమలాపురం డాక్టర్‌లు జానకీవి, పద్మరాణి, కిమ్స్ డెంటిస్ట్ డాక్టర్ సింధూరల పర్యవేక్షణలో విద్యార్థులకు దంత వైద్య పరీక్షలు నిర్వహించారు. దంతాల్లో లోపం ఉన్న రోగులను గుర్తించి కిమ్స్ ఆస్పత్రికి తరలించామన్నారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఏ జీవీవీకె ప్రసాద్, ఎంఎల్‌హెచ్‌పీ ఎస్ నిషి, ఏఎన్ఎం ఎన్.నాగలక్ష్మి, ఆశాలు పాల్గొన్నారు.

పూడిక తొలగింపు

మామిడికుదురు: మామిడికుదురు 216వ నంబర్ జాతీయ రహదారి నుంచి లూటుకుర్రు, మాకనపాలెం గ్రామాలకు సాగు నీరు సరఫరా చేసే పంట కాలువ పూర్తిగా పూడుకుపోయింది. దీంతో కాలువ శివారు భూములకు సాగు నీటి సరఫరా సక్రమంగా జరగడం లేదు. ఈ కాలువను అభివృద్ధి చేయాలని రైతులు నీటి సంఘం ప్రతినిధులను కోరారు. దీనిపై స్పందించిన చైర్మన్ మద్దాల తమ్మన్న ఆధ్వర్యంలో శుక్రవారం జేసీబీ సహాయంతో పంట కాలువలో పూడిక తొలగింపు పనులు చేపట్టారు. కాలువ నుంచి తీసిన పూడికను పంచాయతీ ట్రాక్టర్ సహాయంతో డంపింగ్ యార్డ్‌కు తరలించారు. ఈ పనులను సర్పంచ్ గౌస్ మొహిద్దీన్, పంచాయతీ కార్యదర్శి పీవీఆర్‌కే రాజు పర్యవేక్షించారు.

జిల్లా విద్యా వైజ్ఞానిక ప్రదర్శనకు జాహ్నవి


జి.అగ్రహారంలో హెచ్‌ఎం చేతుల మీదుగా మెమెంటో, ధ్రువీకరణ పత్రం అందుకుంటున్న జాహ్నవిశివదుర్గ


గూడపల్లి పల్లిపాలెం జెడ్పీ హైస్కూల్ విద్యార్థినులను అభినందిస్తున్న ప్రముఖులు

అంబాజీపేట: జిల్లా స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శనకు గంగలకుర్రు అగ్రహారం జెడ్పీ హైస్కూల్‌కు చెందిన చొల్లంగి జాహ్నవిశివదుర్గ ఎంపికైనట్లు హెచ్‌ఎం జీహెచ్ రాజశేఖర్ చెప్పారు. స్థానిక హైస్కూల్‌లో జాహ్నవిని పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు శుక్రవారం అభినందనలు తెలిపారు. హెచ్‌ఎం మాట్లాడుతూ ఈ నెల 2న పుల్లేటికుర్రులో జరిగిన మండల స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శన పోటీల్లో అంతరిక్ష ఆధారిత సౌర విద్యుత్తు అనే ప్రాజెక్టు ప్రదర్శించడంతో ప్రథమ స్థానం గెలుచుకుని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా పోటీలకు ఎంపికైందన్నారు. అనంతరం ప్రశంసా పత్రం, మెమెంటోలను విద్యార్థి జాహ్నవి శివదుర్గకు హెచ్‌ఎం అందజేశారు. జిల్లా స్థాయికి ఎంపికైన జాహ్నవి శివదుర్గను సర్పంచ్ దొంగ నాగేశ్వరరావు, ఎంపీటీసీ విత్తనాల దుర్గా భవాని, ఇంద్రశేఖర్, ఉప సర్పంచ్ బంధన రాంబాబు, గ్రామ పెద్దలు ఎంఎం శెట్టి, కట్టా సుబ్రహ్మణ్యం, ఎంఈఓ-1 కాంద్రేగుల వెంకటేశ్వరరావు, ఎంఈఓ-2 మోకా ప్రకాష్, ఉపాధ్యాయులు అభినందించారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు హైస్కూల్ విద్యార్థులు

మలికిపురం: మండలంలోని గూడపల్లి పల్లిపాలెం జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు రాష్ట్ర స్థాయి కౌశల్ పోటీలకు ఎంపికయ్యారు. పాఠశాల హెచ్‌ఎం ఆచంట రామచంద్రరరావు శుక్రవారం వివరాలు తెలిపారు. జిల్లా స్థాయిలో ఎంపికైన వీరు విజయవాడలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొని అర్హత సాధించారు. కాగా పోస్టర్ విభాగంలో జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం పొందిన పెచ్చెట్టి లక్ష్మీశ్రీ(9వ తరగతి)కి రూ.1500, క్విజ్ విభాగంలో ద్వితీయ స్థానం పొందిన పెచ్చెట్టి రమ్యశ్రీ (9వ తరగతి)కి రూ.1000 బహుమతులను ఇచ్చారు. విద్యార్థులను ఎస్ఎంసీ చైర్మన్ కొల్లు శేషారావు, వైస్ చైర్మన్ పీవీవీ సత్యనారాయణ, సర్పంచ్ పెచ్చెట్టి నరసింహస్వామి, ఎంపీటీసీ కొల్లు నరసింహారావు అభినందించారు.

బీజేపీ మండల శాఖ అధ్యక్షుల ఎన్నిక

మామిడికుదురు: బీజేపీ మండల శాఖ అధ్యక్షుడిగా బైరిశెట్టి దుర్గారామకృష్ణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మామిడికుదురు అంబేద్కర్ సామాజిక భవనంలో శుక్రవారం జరిగిన సమావేశంలో నూతన కార్యవర్గ ఎన్నిక జరిగింది. మండల శాఖ అధ్యక్షుడు మెండా ఆదినారాయణ ఆధ్వర్యంలో ఈ ఎన్నిక జరిగింది. మండల అధికార ప్రతినిధిగా కంకిపాటి సుబ్బారావు ఎన్నికయ్యారు. ఈ ఎన్నికకు పర్యవేక్షకుడిగా రాష్ట్ర ఉపాధ్యక్షుడు మానేపల్లి అయ్యాజీవేమా, మండల రిటర్నింగ్ అధికారిగా గనిశెట్టి వెంకటేశ్వరరావు, ఏఆర్‌ఓగా బైరిశెట్టి వెంకటేశ్వరరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాలూరి సత్యానందం హాజరయ్యారు. పార్టీని మరింత పటిష్టం చేయడం కోసం యువతకు ప్రాధాన్యం ఇచ్చామని మాజీ ఎమ్మెల్యే వేమా తెలిపారు. మాజీ అధ్యక్షుడు ఆదినారాయణను ఘనంగా సత్కరించారు. సమావేశంలో పార్టీ నేతలు గాడి సత్తిబాబు, ఆకుల దొరబాబు, అడపా వెంకటరత్నం, పసుపులేటి మహలక్ష్మీరావు, వేగి వెంకటేశ్వరరావు, నక్కా త్రిలోచనరావు తదితరులు హాజరయ్యారు.

కొత్తపేట మండల అధ్యక్షుడిగా కనకేశ్వరరావు

కొత్తపేట: బీజేపీ మండల శాఖ నూతన కార్యవర్గ ఎన్నికకు సంబంధించి ఆ పార్టీ మండల అధ్యక్షుడు పొలాటి మాధవస్వామి అధ్యక్షతన జరిగిన సమావేశంలో రాష్ట్ర పార్టీ కార్యవర్గ సభ్యుడు పాలూరి సత్యానందం, జిల్లా ప్రధాన కార్యదర్శి మోకా సుబ్బారావు తదితరులు ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. వారి సమక్షంలో మండల అధ్యక్ష పదవికి నామినేషన్లు కోరగా సంపతి కనకేశ్వరరావు ఒక్కరే పోటీకి ముందుకు వచ్చారు. దాంతో బూత్ అధ్యక్షులు, క్రియాశీలక సభ్యులతో పాటు సమావేశం ఏకాభిప్రాయంతో మండల బీజేపీ అధ్యక్షుడిగా సంపతి కనకేశ్వరరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల పార్టీ ప్రతినిధిగా రాష్ట్ర యువ మోర్చా అధికార ప్రతినిధి పాలూరి జయప్రకాష్‌నారాయణ (జేపీ)ని ఎన్నుకున్నారు. రాష్ట్ర, జిల్లా నాయకులు మాట్లాడుతూ నూతనంగా ఎన్నికైన కనకేశ్వరరావు నాయకత్వంలో పార్టీ మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు.

కిశోరి వికాసంపై ఒక రోజు శిక్షణ

సఖినేటిపల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం రాజోలు ఐసీడీఎస్ శాఖ ఆధ్వర్యంలో కిశోరి వికాసంపై మండల స్థాయి శిక్షకుల ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీవో వైకేడీ రమాదేవి ముఖ్యఅతిథిగా మాట్లాడారు. బేటీ బచావో, బేటీ బచావో పథకం పైన, పిల్లల్లో న్యూట్రిషన్, హెల్త్ స్టేటస్ పురోగతి, చైల్డ్ మ్యారేజ్ నిర్మూలనపై రమాదేవి అవగాహన కల్పించారు. అలాగే కిశోరి బాలికలలో ఆరోగ్యం, రక్షణపై తల్లిదండ్రుల్లో అవగాహన పెంచాలని, స్కూల్‌లో డ్రాప్ అవుట్‌లు తగ్గించాలని, పోక్సో కేసుల గురించి కూడా ఆమె వివరించారు. ఎంపీపీ వీరా మల్లిబాబు, ఎంపీడీవో కె.సూర్యనారాయణ, ఎంఈవో-1 డి.కిషోర్‌కుమార్, మెడికల్ ఆఫీసర్ యూనస్, ఎంపీహెచ్‌వో కె.గంగాధర్, ఎంపీహెచ్ఎస్ పీఎల్ఎన్ స్వామి, ఏపీఎం అజయ్, ఎస్సై కె.దుర్గా శ్రీనివాసరావు, టీచర్ ఎ.శ్రీనివాసరావు, ఐసీడీఎస్ సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

రహదారి నిర్మాణానికి చర్యలు

అయినవిల్లి: చాలా కాలంగా అభివృద్ధికి నోచుకోని ముక్తేశ్వరం-కె.జగన్నాథపురం రహదారిని 4 కిలోమీటర్ల మేర అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపడతామని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. శుక్రవారం ముక్తేశ్వరం-కె.జగన్నాథపురం రహదారిని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ కూటమి నాయకులతో కలసి పరిశీలించారు. సంక్రాంతికి ఈ రహదారిపై రాకపోకలు ఎక్కువగా ఉండటంతో ప్రస్తుతం తాత్కాలిక మరమ్మతులు త్వరితగతిన చేయాలని ఏఈ రమేష్‌ను ఆదేశించారు. రహదారి కిలోమీటరు మేర నాయకులతో కలసి ఎమ్మెల్యే నడిచి పరిస్థితిని తెలుసుకున్నారు. ఆయన వెంట కూటమి నాయకులు ఉన్నారు.

ఎక్సైజ్ దాడుల్లో ఇద్దరి అరెస్ట్

కొత్తపేట: స్థానిక ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో 18 మద్యం బాటిల్స్‌తో ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్టు స్థానిక ఎక్సైజ్ ఎస్సై కె.అన్నవరం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సీఐ కె.కాత్యాయని ఆదేశాల మేరకు నిర్వహించిన దాడుల్లో కొత్తపేట శివారు పెదరాముడినూతిమెరక గ్రామంలో 10 బాటిళ్లతో సానబోయిన లక్ష్మిని, బిళ్లకుర్రులో 8 మద్యం బాటిళ్లతో యాళ్ల రామాంజనేయులును అరెస్టు చేసినట్టు పేర్కొన్నారు. ఇద్దరిపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

రెవెన్యూ సదస్సులో అధికారుల ఘెరావ్

ఆలమూరు: మండలంలోని బడుగువానిలంకలో శుక్రవారం జరిగిన రెవెన్యూ సదస్సులో తీవ్ర గందరగోళం నెలకొంది. దశాబ్దాలుగా అపరిష్కృతంగా ఉన్న లంక భూముల అడంగల్ సమస్యలను పరిష్కరించకపోవడంతో అఖిల భారత రైతు కూలి సంఘం జిల్లా అధ్యక్షుడు జనుపల్లి సత్తిబాబు ఆధ్వర్యంలో రైతులు గ్రామ రెవెన్యూ సదస్సును ముట్టడించి అధికారులను ఘెరావ్ చేశారు. గత 25 ఏళ్లుగా గ్రామంలో భూసమస్యలను పరిష్కరించకుండా రెవెన్యూ సదస్సులు ఏర్పాటు చేసినా ఫలితమేంటని ప్రశ్నించారు. స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద నిర్వహించిన ఈసదస్సులో కొత్తపేట ఆర్డీవో శ్రీకర్ వచ్చి రైతులకు సంజాయిషీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. మా సమస్యలను పరిష్కరించే వరకూ అధికారులను వెళ్లనిచ్చేది లేదని దిగ్బంధం చేశారు.

20 నాటికి సమస్యను పరిష్కరిస్తాం

బడుగువానిలంకలో రైతులు లేవనెత్తిన సమస్యలను ఈనెల 20 లోపు పరిష్కరించేందుకు కృషి చేస్తామని తహసీల్దార్ కేజే ప్రకాష్‌బాబు అన్నారు. అధికారులు భూముల వద్దకు పక్కాగా సర్వే నిర్వహించి ఆన్‌లైన్‌లో పేర్లను నమోదు స్తామని హామీ ఇచ్చారు. రైతుల నుంచి సుమారు 40 అర్జీలను అధికారులు స్వీకరించారు. అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రైతు బాంధవుడు జమ్మీలు


అంబాజీపేటలో జమ్మీలును సత్కరిస్తున్న కృషివల నాయకులు

అంబాజీపేట: అహర్నిశలు రైతుల అభ్యున్నతికి కృషి చేసి వారి ఆర్థిక పురోభివృద్ధికి సేవలందించిన ముత్యాల జమ్మీలు రైతు బాంధవుడని కృషివల కోకోనట్ ఫార్మర్స్ ప్రొడ్యూసర్స్ కంపెనీ లిమిటెడ్ చైర్మన్ గణపతి వీరరాఘవులు, ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు అన్నారు. ఇటీవల ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ (ఏపీఈఆర్‌సీ) సభ్యుడిగా నియమితులైన ముత్యాల శ్రీరామ నాగేంద్ర ప్రసాద్ (జమ్మి)ని స్థానిక ప్రొడ్యూసర్స్ కంపెనీ కార్యాలయంలో శుక్రవారం ఘనంగా సన్మానించారు. పలువురు వక్తలు మాట్లాడుతూ రైతు ఉద్యమ నాయకుడిగా పనిచేస్తున్న జమ్మీ ఏపీఈఆర్‌సీ ద్వారా రైతులకు మెరుగైన సేవలు అందించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ దొంగ నాగేశ్వరరావు, బొంతు పెదబాబు, అడ్డాల గోపాలకృష్ణ, నాగవరపు నాగరాజు, మైపాల తాతాజీ, నాగాబత్తుల సుబ్బారావు, ఉప్పుగంటి భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన పారిశుధ్యంతో సంపూర్ణ ఆరోగ్యం

ఆలమూరు: గ్రామీణ ప్రాంతాల్లో సంపూర్ణ పారిశుధ్యం నెలకొల్పేందు వీలుగా ప్రతి శుక్రవారాన్ని పొడి వారం (డ్రైడే)గా పాటించి సంపూర్ణ పారిశుధ్యం నెలకొల్పాలని చొప్పెల్ల, పెదపళ్ల పీహెచ్‌సీ వైద్యాధికారులు డి.సువర్చలాదేవి, ఆర్.మల్లికార్జున్, డి.సాయికిషోర్ అన్నారు. డ్రైడే సందర్భంగా ఆయా గ్రామాల్లోని ఆరోగ్య, ఆశ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ఇంట్లో నిల్వ నీరు ఉండకుండా తీసుకోవలసిన చర్యలను వివరించారు. ఎంపీహెచ్ఈఓ కె.జ్యోతికుమార్, హెల్త్ ఎడ్యుకేటర్లు ఏవీవీ రాజా, బి.సూర్యనారాయణ, సూపర్‌వైజర్లు ఎం.శ్రీనివాసరావు, పి.శివప్రసాద్, పి. ఉమ, ఆర్.బాలమణి వైద్యసేవలను పర్యవేక్షించారు.

సావిత్రీబాయి చిరస్మరణీయురాలు


మలికిపురంలో సావిత్రీబాయి పూలే చిత్రపటానికి పూలమాల వేసిన మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు


అంబాజీపేటలో సావిత్రీబాయి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీపీ వెంకటేశ్వరరావు

మామిడికుదురు: మహిళల కోసం ఎన్నో పోరాటాలు చేసిన సావిత్రీబాయి పూలే చిరస్మరణీయురాలని బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు గుబ్బల మురళీకృష్ణ ప్రస్తుతించారు. సావిత్రీబాయిపూలే జయంతి సందర్భంగా శుక్రవారం మామిడికుదురు బాలుర వసతి గృహం ప్రాంగణంలోని విగ్రహానికి ఉద్యోగ సంఘం నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

మలికిపురం: సావిత్రీబాయి పూలేని ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ రాజోలు కో ఆర్డినేటర్ గొల్లపల్లి సూర్యారావు పేర్కొన్నారు. మలికిపురంలో వైఎస్సార్ సీపీ కార్యాలయంలో పార్టీ ఆధ్వర్యంలో సావిత్రీబాయి జయంతిని నిర్వహించారు. ఆమె చిత్రపటానికి ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

రావులపాలెం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల రావులపాలెంలో ఎన్ఎస్ఎస్ అధికారి ఎస్.అరుణ్‌కుమార్, మహిళా సాధికారిత సెల్ కన్వీనర్ జి.సుమలత సంయుక్త ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ డాక్టర్ వి.శ్రీనివాసరావు అధ్యక్షతన ముందుగా సావిత్రీబాయి పూలే జయంతి నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అంబాజీపేట: సావిత్రీబాయి పూలే జీవితం మహిళాజాతికి మహిళా ఉపాధ్యాయులకు ఆదర్శమని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు అన్నారు. అంబాజీపేట మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సావిత్రీబాయి పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

సఖినేటిపల్లి: సావిత్రీబాయి జయంతిని అంతర్వేదికర జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. సావిత్రిబాయి పూలే చిత్రపటం వద్ద పాఠశాల హెచ్‌ఎం పి.సోమ సూర్యకుమారి నివాళులర్పించారు.

రాజోలు: సావిత్రీబాయి సేవలు చిరస్మరణీయమని రాజోలు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సాయిబాబు అన్నారు. సావిత్రిబాయి జయంతి పురస్కరించుకుని ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

పి.గన్నవరం: సావిత్రీబాయి పూలే జయంతి సందర్భంగా పి.గన్నవరం శివారు డీఎస్‌పాలెం ప్రాథమిక పాఠశాలలో ఆమె చిత్రపటానికి శుక్రవారం బీసీ సమన్వయ కమిటీ జిల్లా అధ్యక్షుడు అధ్యక్షుడు దొంగ రామసత్యనారాయణ పూలమాలలు వేసి, నివాళులర్పించారు.

కొత్తపేట: స్థానిక వీకేవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేపీ రాజు అధ్యక్షతన కళాశాలలో సావిత్రీబాయి జయంతి నిర్వహించారు. ఆమె చిత్రపటానికి ప్రిన్సిపాల్ రాజు తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ టి.రమాదేవి పాల్గొన్నారు.

రేషన్ డీలర్ల నియామకానికి నోటిఫికేషన్

కొత్తపేట: స్థానిక రెవెన్యూ డివిజన్ పరిధిలోని ఖాళీ అయిన రేషన్ దుకాణాలకు శాశ్వత ప్రాతిపదికన డీలర్లను నియమించుటకు ఆర్డీవో పి.శ్రీకర్ నోటిఫికేషన్ జారీ చేశారు. ఆ మేరకు శుక్రవారం రాత్రి ఆర్డీవో ఒక ప్రకటన విడుదల చేశారు. డీలర్ల రాజీనామా/మృతి కారణంగా ఖాళీ అయిన 38 చౌక ధర దుకాణాలకు, రేషన్‌కార్డుల సర్దుబాటు వలన కొత్తగా ఏర్పడిన 23 దుకాణాలకు కలిపి మొత్తం 61 రేషన్ షాపులకు డీలర్లను నియమించనున్నట్లు తెలిపారు. డీలర్ల నియామక రాత పరీక్ష, ఇంటర్వ్యూ ద్వారా జరుగుతుందని పేర్కొన్నారు. నోటిఫికేషన్‌లో నిబంధనలకు లోబడి అర్హులైన అభ్యర్థులు తమ దరఖాస్తులను నేరుగా ఆర్డీవో కార్యాలయం లేదా రిజిస్టర్ పోస్టు ద్వారా ఈ నెల 10వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు అందజేయాలని పేర్కొన్నారు. ఈ నెల 19న రాత పరీక్ష, 22, 23 తేదీల్లో ఇంటర్వ్యూల అనంతరం ఎంపికైన అభ్యర్థులకు 24న నియామక ఉత్తర్వులు అందజేస్తారని పేర్కొన్నారు.

10 లోగా దరఖాస్తులు అందించాలి

మామిడికుదురు: మండలంలోని ప్రతిభావంతులైన, ఆర్థికంగా వెనుకబడిన కాపు విద్యార్థులకు తులసీ సీడ్స్ అధినేత గుంటూరుకు చెందిన తులసీ రామచంద్రప్రభు ఆర్థిక సాయంతో ఈ నెల 19న నగదు పురస్కారాలు అందజేస్తామని తెలగా ఉద్యోగ సంక్షేమ సంఘం మండల శాఖ అధ్యక్షుడు తోట వెంకటేశ్వరరావు తెలిపారు. మామిడికుదురులో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజోలు మండలం శివకోడు మంగెన గంగయ్య తెలగా కల్యాణ మండపంలో ఈ పురస్కారాల పంపిణీ జరుగుతుందన్నారు. రాజోలు తాలూకా తెలగా ఉద్యోగ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కార్యక్రమం జరుగుతుందన్నారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం నుంచి పీజీ వరకు చదువుతున్న విద్యార్థులు 80 శాతం పైబడి మార్కులు సాధించిన వారు అర్హులని తెలిపారు. అర్హత కలిగిన విద్యార్థులు ఈ నెల 10వ తేదీ లోగా మండల కార్యవర్గ సభ్యులకు తమ దరఖాస్తులను అందజేయాలన్నారు. సమావేశంలో సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

హైస్కూలు అదనపు తరగతి గదుల భవనం ప్రారంభం


ఉన్నత పాఠశాల అదనపు భవనాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే గిడ్డి, స్థలదాత ప్రభావతి

పి.గన్నవరం: పాఠశాలల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్మించిన నాలుగు అదనపు తరగతుల భవనాన్ని శుక్రవారం పాఠశాల స్థలదాత శింగంశెట్టి ప్రభావతి చేతుల మీదుగా ఎమ్మెల్యే గిడ్డి ప్రారంభించారు. హెచ్‌ఎం డీఎస్‌వీ ప్రసాద్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ పాఠశాలకు ఎంతో విలువైన ఐదు ఎకరాల భూమిని ఇచ్చిన ప్రభావతిని అభినందించారు. జెడ్పీ మాజీ చైర్మన్ ఎన్.రాంబాబు, డొక్కా నాథ్‌బాబు, ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, నాయకులు ఎస్.వెంకటేశ్వరరా వు, తోలేటి సత్తిబాబు, సాధనాల జేడీ, సంసాని పెద్దిరాజు, కుమార్, సీహెచ్ సత్తిబాబు, ఎంఈఓ కె.హెలీనా పాల్గొన్నారు.

కారు బోల్తా: తప్పిన ప్రాణాపాయం

ఆలమూరు: 216 (ఏ) నంబర్ జాతీయ రహదారిలోని జొన్నాడలో జరిగిన కారు బోల్తా పడిన సంఘటనలో ఒకే కుటుంబానికి చెందిన ఆరుగురికి ప్రాణాపాయం తప్పింది. స్థానికుల కథనం ప్రకారం రావులపాలెం నుంచి రాజమహేంద్రవరం వైపు వెళ్తున్న ఒక చిన్న కారు స్థానిక ఫ్లైఓవర్ వద్దకు వచ్చే సరికి అస్తవ్యస్తంగా ఉన్న రోడ్డు వల్ల ఇసుక ట్రాక్టర్‌ను తప్పించబోయి బోల్తా కొట్టింది. స్థానికులు స్పందించి కారులో చిక్కుకున్న రాజోలు గ్రామానికి చెందిన ఎం.దేవరాజ్ కుటుంబ సభ్యులను సురక్షితంగా బయటకు తీయడంతో వారంతా స్వల్పగాయాలతో సురక్షితంగా బయట పడ్డారు. కారులో ప్రయాణిస్తున్న వారిలో ఒక మహిళ, ఒక పురుషుడుతో పాటు నలుగురు చిన్నారులు కూడా ఉన్నారు. దాంతో పెనుప్రమాదం తప్పడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.